

కేటీపీపీ మొదటి దశ విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

గణపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు మొదటి దశ 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్ పడింది. బాయిలర్ ట్యూబ్ లీకేజీ కావడంతో శనివారం మొదటి దశలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అంతేకాకుండా రెండో దశ 600మెగావాట్ల విద్యుత్ కేంద్రానికి రెండు రోజుల క్రితం ట్యూబ్ లీకేజీ సమస్య తలెత్తగా మరమ్మత్తులు చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రాజెక్టు గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. మొదటి దశను కూడా రెండో రోజుల్లో విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

పంచాయతీ రిజర్వేషన్లపై కసరత్తు

- నేడు అధికారింగా వెల్లడి కానున్న రిజర్వేషన్లు
- సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేయనున్న ఆర్‌డీవోలు...
- వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేయనున్న ఎంపీడీవోలు
- మారనున్న గత బీసీ రిజర్వేషన్లు
- ముమ్మరంగా ఎన్నికల ఏర్పాట్లు



బిజీ బిజీగా అధికార యంత్రాంగాలు

హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో శరవేగంగా జరుగుతోంది. రిజర్వేషన్లను ఖరారు చేయడంలో అధికారులంతా బిజీబిజీగా ఉన్నారు. రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దీనితో అప్రమత్తమైన అధికారులు.. శుక్రవారం నుంచే తమ పని మొదలు పెట్టారు. రోజంతా ఆయా గ్రామ పంచాయతీల జనాభా, ఓటర్ల సంఖ్య తదితర సంబంధిత వివరాలను సేకరించారు. శనివారం ఉదయం నుంచి రిజర్వేషన్ల ఖరారు పనిలో మునిగిపోయారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధికార యంత్రాంగతాలు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ఇందులో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ఖరారుకు శనివారం ఉదయం 9 గంటలనుంచి రాత్రి పొద్దు పోయే వరకు కుస్తీ పట్టారు. సర్పంచుల రిజర్వేషన్లను ఆర్డీవో, వార్డుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేస్తున్నారు.

50 శాతం మించకుండా..

ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గతంలో మాదిరిగా 50 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో ఆ దిశగా అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేస్తున్నారు. ఈ లెక్కన 50 శాతం స్థానాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పోను మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరి స్థానాలుంటాయి. అన్నిట్లో సగం స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా ప్రాతిపదికన ఖరారు చేయాల్సి ఉంటుంది. గత నెల అక్టోబరులో నోటిఫికేషన్ ఇవ్వడానికి సన్నద్ధమైన తరుణంలోనే అంతకన్నా ముందు సెప్టెంబరు నెలాఖరులో ఈ రిజర్వేషన్లను ఖరారు చేశారు. గిరిజన గ్రామాలను ఎస్టీలకు రిజర్వే చేశారు. వాటిలో ఇప్పుడు కూడా ఎలాంటి మార్పులు లేనట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం ఆదేశాలు, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వే (ఎస్ఈఈఈపీసీ)-2024 ప్రకారం డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బీసీ, జనరల్ రిజర్వేషన్లపై శనివారం కసరత్తు జరిగింది.

సర్పంచ్, వార్డు స్థానాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 75 మండలాలు, 1708 గ్రామ పంచాయతీలు, 15006 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. వీటిలో వరంగల్ జిల్లాలో 11 మండలాలు, 317 గ్రామ పంచాయతీలు, 2754 వార్డులు, హనుమకొండ జిల్లాలో 12 మండలాలు, 210 గ్రామ పంచాయతీలు, 1986 వార్డులు, జనగామ జిల్లాలో 12 మండలాలు, 210 గ్రామ పంచాయతీలు, 1986 వార్డులు8, మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలు, 482 గ్రామ పంచాయతీలు, 4110 వార్డులు, ములుగు జిల్లాలో 10 మండలాలు, 171 గ్రామ పంచాయతీలు, 1520 వార్డులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు, 248 గ్రామ పంచాయతీలు, 2101 వార్డులకు ఎన్నికలు జరపాల్సి ఉంది. ఉన్నాయి. పోలింగ్ నిర్వహణకు 15006 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పర్యవేక్షణ

రెవెన్యూ డివిజన్ కార్యాలయం పరిధిలోని సర్పంచ్ స్థానాలకు ఆయా ఆర్‌డీవోలు రిజర్వేషన్లను కేటాయిస్తుండగా, వీటిని డీఆర్‌డీవో, అదనపు ఆర్డీవోలు, డీఎల్‌పీవోలు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. వార్డు స్థానాలకు ఎంపీడీవోలు రిజర్వేషన్లను నిర్ణయిస్తున్నారు. జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు, డీఎల్పీవోలు పర్యవేక్షిస్తున్నారు. కాగా, మహిళలకు ఆయా స్థానాల్లో రిజర్వేషన్లను ఆదివారం కలెక్టర్ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఖరారు చేస్తారు. ఆదే రోజు (మిగతా 7వ పేజీలో)

ములుగు డీసీసీ అధ్యక్షుడిగా పైడాకుల అశోక్

రెండోసారి నియమించిన అధినాయకత్వం



ములుగు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):డీసీసీ అధ్యక్షులను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం శనివారం ప్రకటించింది. ములుగు జిల్లా అధ్యక్షుడిగా పైడాకుల అశోక్‌ను రెండో సారి నియమించింది. జిల్లా నుంచి గొల్లపెల్లి రాజేందర్ (ములుగు), మల్లాడి రాంరెడ్డి (వెంకటాపూర్), ఇర్సవడ్ల వెంకన్న (ఏటూరునాగారం), సూరప నేని నాగేశ్వర్‌రావు(చల్వాయి), మోహన్‌రావు (వాజేడు), పైడాకుల అశోక్ (గోవిందరావుపేట) జిల్లా అధ్యక్షుడి పోటీలో ఉన్నారు. అయితే గత సంవత్సరం అధ్యక్షుడిగా పనిచేసిన అశోక్‌ను అధిష్టానం మళ్లీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకుంది. జిల్లాలో పర్యటించి పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, ఇతర భాగస్వాములతో సమావేశమై క్షేత్రస్థాయిలో పరశీలి ంచాకే జిల్లా అధ్యక్షులను నియమించినట్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకటించారు. ఈ సందర్భంగా అశోక్‌కు పలువురు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్



ములుగు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఎస్పీగా సుధీర్ రామ్‌నాథ్ కేకన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మహబుబాబాద్ జిల్లా నుంచి ములుగు జిల్లా ఎస్పీగా శుక్రవారం బదిలీ ఉత్తర్వులు రాగా శనివారం బాధ్యతలు సీకరించారు. గతంలో ములుగు ఏఎస్పీ, జిల్లా ఓఎస్డీగా విధులు నిర్వహించారు. అంతేకాకుండా మేడారం మహా జాతరలో పనిచేసిన అనుభవం ఉంది. గతంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ తిరిగి ములుగు జిల్లా ఎస్పీగా రావడంతో ప్రజలు, పోలీస్ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతిల ఉత్తమ ఫలితాల సాధనకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో 10వ తరగతి ఫలితాలు, ఉపాధ్యాయలు, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు నమోదు, యుడైస్, ఆధార్, ఆపార్ జారీ, పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం 93.55 శాతం ఫలితాలు సాధించామని, ఈ సంవత్సరం నూరుశాతం ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. ముందస్తు కార్యచరణతో విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు ప్రస్తుతం 68.30 శాతం మాత్రమే ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడిగా బట్టు కరుణాకర్ ఎన్నిక



భూపాలపల్లిటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బట్టు కరుణాకర్ ఎంపికయ్యారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కరుణాకర్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేసింది. శనివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్ణాకర్ 2009నుంచి విద్యార్థి నేతగా ఎన్‌ఎస్‌యూఐలో పనిచేశారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా చేశారు. అనంతరం భూపాలపల్లి జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పనిచేశారు. గత ఏడాది నుంచి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల డీసీసీ అధ్యక్ష పదవికి పోటీపడగా కరుణాకర్‌ను పదవి వరించింది. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాచైతన్యమే ధ్యేయంగా కళాకారులు పనిచేయాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్

గోవిందరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యమే ధ్యేయంగా కళాకారులు పనిచేయాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. శనివారం మండలంలోని పస్రాలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ప్రజానాట్య మండలి ములుగు డివిజన్‌స్థాయి శిక్షణ తరగతులు గుగ్గిళ్ల దేవయ్య అధ్యక్షతన జరగగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళ కాసులకోసం కాదని, ప్రజల కోసం ఉపయోగపడాలన్నారు. అనేక ఉద్యమాలు కళారూపాల ద్వారా ఉద్భవించాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం కళ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కళాకారులు తమ కళారూపాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి నక్క సైదులు, నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, అంబాల మురళి, ప్రవీణ్, నాగరాజు, కవిత, సువర్ణ, రాజు, చిరంజీవి, కృష్ణబాబు, దామోదర్, విజయ్ కుమార్, ఐలయ్య, రాజు, రామకృష్ణ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు విరామం — మూడు నెలల పాటు ముహూర్తాలు నిల్ 7

చికిత్స పొందుతూ రైతు మృతి

అప్పుల బాధతో ఈ నెల 7న ఆత్మహత్యాయత్నం



మృతుడు రవీందర్ (ఫైల్)

చిట్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చింతకుంటరామయ్యపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు అబ్బెంగుల రవీందర్ (45) తనకున్న రెండెకరాల్లో పత్తి, 1 ఎకరం వరిపంట సాగు చేస్తున్నాడు. గత రెండు సంవత్సరాలుగా పంట దిగుబడి రాకపోవడం, కుటుంబ పోషణకు చేసిన అప్పులు పెరిగిపోయాయి. దీనికితోడు గత కొంత కాలంగా అతడి భార్య అనిత అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. రూ. 5లక్షలకు పైగా అప్పులు కావడంతో రవీందర్ నవంబరు 7న ఇంటివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కొంత సమయం తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. కాగా రవీందర్ ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి చిన్న కుమార్తె శ్రీలత పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై-2 హేమలత తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

- మేడారంలో అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి సీతక్క
- పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం



దేవస్థానంలో పనులు పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మల జాతర పనులను సకాలంలో పూర్తి చేయాలని, గిరిజన సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండా లని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మేడారం పర్య టనలో భాగంగా శనివారం పనుల పురోగతిని పరిశీలిం చారు. అభివృద్ధి పనుల వివరాలను సంబంధిత అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా మంత్రి కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, సంబంధిత అధికారులతో కలిసి ఆదివాసి మ్యూజియం పరిశీలించారు. మహా జాతరలో భక్తులకు సమ్మక్క సారలమ్మల చరిత్ర, జాతర చిత్రాలు, ఆదివాసి జీవన విధానం, కళా చిత్రాలను భక్తులకు కనువిందు కలిగించేలా ఉండాలన్నారు. మ్యూజియం అభివృద్ధి పనులు త్వరగతిన ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. అనంతరం లక్షా20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు పరిశీలించారు. రోడ్ల విస్తరణ పనులు పరిశీలించి దేవస్థానంలో పునరుద్ధరణ పనులను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పనుల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం వనదేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్ల ప్రసాదాలను మంత్రికి అందజేశారు.

ఐటీడీఏ అతిథిగృహంలో పలుశాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సమ్మక్క సారలమ్మల కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వ్యాప్తంగా తెలిసేలా నిర్మాణాలు ఉండాలని అన్నారు. మేడారం మహా జాతరను విజయవంతం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపు తున్నారని అన్నారు. అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచిం చారు. అదనపు కార్మికులు, యంత్రాలు, నిపుణులను సమకూర్చుకొని నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులును ఆదేశించారు. జాతీయ రహదారిపై మల్లంపల్లి, కటాక్షపూర్ వంతెనల పనులను త్వరగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రీ మేడారంలో తర లివచ్చే భక్తులకు ఇబ్బం దులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వసంత రావు, పలు శాఖల అధికారులు, పూజారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న మేడారం పనులు

- జంపన్నవగులో సారలమ్మ దారికి మరమ్మతు - వివరాలు 6లో



గద్దెల ప్రాకారానికి నిర్మించిన రాతి స్తంభాలు

పారిశుధ్య కార్మికుడి ఆకస్మిక మృతి

- పనిచేస్తున్న ప్రదేశంలో కుప్పకూలిన రాజయ్య
- సానిటరీ ఇన్‌స్పెక్టర్ తీరుపై తోటి కార్మికుల మండిపాటు
- వంద పడకల ఆసుపత్రి నుంచి మృతదేహంతో కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లి నిరసన
- అడ్డుకున్న పోలీసులు



మృతి చెందిన బొల్లి రాజయ్య



కలెక్టరేట్‌లోని హాలులో మృతదేహంతో నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు



నిరసనకారులను వాహనంలో ఎక్కిస్తున్న పోలీసులు

కృష్ణకాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్య కార్మికుడు ఆకస్మిక మరణం ఉద్రిక్త పరిస్థితికి దారి తీసింది. మృతదేహంతో కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు చేసిన కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. భూపాలపల్లి పట్టణంలోని సీఆర్‌నగర్ కాలనీకి చెందిన బొల్లి రాజయ్య (48) అనే వ్యక్తి భూపాలపల్లి మునిసిపాలిటీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజువారి విధుల్లో భాగంగా ఆయన శనివారం విధులకు హాజరయ్యాడు. ఈ క్రమంలో పనుల అప్పగింతలో భాగంగా పలువురు కార్మికులకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ చెట్లు కొట్టే పనులను అప్పగించగా కృష్ణకాలనీలోని మసీదు సమీపంలో బొల్లి రాజయ్య సైతం వెళ్లాడు. తోటి కార్మికులతో కలిసి పనిలో నిమగ్నమైన ఆయన ఉన్నట్టుండి కుప్పకూలిపోయి కిందపడిపోయాడు. కొద్దిసేపటికే గమనించి రాజయ్యను మందలించిన తోటి కార్మికులు అతను ఉలుకుపలుకు లేకపోవడంతో ఆందోళన చెంది మునిసిపాలిటీ వాహనంలోనే వంద పడకల ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించగా రాజయ్య అప్పటికే మృతి చెందాడు. గుండెపోటుతో ఆకస్మికంగా రాజయ్య మృత్యువాత పడి ఉంటాడని అందరు భావించారు.

సానిటరీ ఇన్‌స్పెక్టర్ తీరుపై ఆగ్రహం?

మునిసిపాలిటీలో సానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న అధికారిపై తోటి కార్మికులు ఆగ్రహం (మిగతా 8వ పేజీలో)



కల్యాణం జరిపిస్తున్న పూజారులు

వైభవంగా వేంకటేశుడి వార కల్యాణం

చిలుపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న ఆలయంలో స్వామివారి వార కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. శనివారం చేపట్టిన కళ్యాణ మహోత్సవానికి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న హాజరై ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలతో పాటు, పూలమాలలను సమర్పించారు. పూజారులు రవిందర్ శర్మ, రంగాచార్యులు వేదమంత్రాలనాలపించి కల్యాణం జరిపించారు. దీంతో ఆలయ ఆవరణంతా భక్తజన సందోహంతో నిండిపోయింది. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, ధర్మకర్తలు రత్నాకర్‌రెడ్డి, గోలి రాజశేఖర్, గనగోని రమేష్, వెంకటేశ్వర్లు, పుల్యాల నారాయణ రెడ్డి తదితరులు పాల్గొనగా, ధర్మసాగర్, శివునిపల్లికి చెందిన తిరునగరి శ్రీనిధి -హరినాథ్, వేముగంటి రేణుక -నర్సింగం దంపతులు అన్నదానం చేశారు.

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషాకు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి జల్ సంచయ్- జన్ భాగీదారీ కార్యక్రమంలో సౌత్ జోన్‌లో అవార్డు పొందిన జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను స్టేషన్‌ఘన్‌పూర్ మండల కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయన కార్యాలయంలో సత్కరించారు. జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలు విజయవంతం చేయడంపై కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ మారపాక వసంత్, నాయకులు చాడ రాజ్‌కుమార్, ఐలపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న మేడారం పనులు

తాడ్వాయి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మల మహా జాతరలో సారలమ్మ రాకకు జంపన్నవాగులో దారి పనులను అధికారులు శనివారం ప్రారంభించారు. జంపన్నవాగులో జంట వంతెనలకు దిగువ ప్రాంతంలో రాళ్లు తేలి దేవత దారి ప్రమాదకరంగా ఉంది. అయితే మహా జాతరలో కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ గుడి నుంచి సారలమ్మ దేవత బయలు దేరి మేడారం గద్దెలకు చేరుకునే క్రమంలో పూజారులు సారలమ్మ దేవతతో పాటుగా జంపన్నవాగులోని నీటిని తాకుతూ దాటుతారు. అధికారులు సారలమ్మ గద్దెలకు చేరుకునే దారి మరమ్మత్తుల కోసం అభివృద్ధి పనులు చేపట్టారు. చిలకల గుట్ట ప్రాంతంలోని ఇసుక ర్యాంపు నుంచి ఇసుకను టిప్పర్‌ల ద్వారా తరలించి వంతెనల మీదు నుంచి వాగులో దారి మరమ్మత్తు పనులు చేపట్టారు.

గద్దెల పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

సమ్మక్క సారలమ్మల దేవస్థానంలో అధికారులు సీసీ కెమెరాలను శనివారం ఏర్పాటు చేశారు. మహా జాతరకు ముందుగా తరలివస్తున్న భక్తుల భద్రతకు దేవదాయ, పోలీస్ అధికారులు సమన్వయంలో కావాల్సిన ప్రాంతాల్లో తాత్కలికంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మహా జాతరకు సమయం దగ్గర పడుతున్న కొద్ది భక్తుల ప్రవాహం అధికం అవుతుందనే ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం చుట్టూ ప్రాకారం, సాలారం తొలగించడంతో అధికారులు దేవస్థానానికి పటిష్ట భద్రతా ఏర్పాటు చేశారు.

జంపన్నవాగులో సారలమ్మ దారికి మరమ్మతులు

దేవస్థానంలో మొదలైన రాతి నిర్మాణాలు

మేడారం సమ్మక్క సారలమ్మల దేవస్థానం పునరుద్దరణ అభివృద్ధి పనుల్లో భాగంగా రాతి నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. సీసీతో నిర్మించి పునాదిపై రాతి స్థంభాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానం చుట్టూ 50 స్థంభాలు ఉండగా 20స్థంభాలను శనివారం వరకు నిలబెట్టారు. అంతేకాకుండా తొమ్మిది ఆర్చిగేట్లు నిర్మించాల్సి ఉంది. అయితే ఒక్కో ఆర్చిగేటు రాతి పిల్లర్ టన్ను బరువు ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. దేవస్థానం పనులు సకాలంలో పూర్తి చేయడానికి పనుల వేగం పెంచామని అంటున్నారు.



జంపన్నవాగులో ఇసుక పోస్తున్న టిప్పర్



పూజల్లో పాల్గొన్న భక్తులు

కాలసర్ప దోష నివారణ పూజలు

మహదేవపూర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శనివారం సందర్భంగా కాలసర్ప దోష నివారణ పూజలు చేపట్టారు. ముందుగా భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం కాలసరప దోష నివారణ పూజల్లో పాల్గొన్నారు.

బోడకాకర కాయ సాగు భేష్

అధిక దిగుబడిని తీస్తున్న మారుమూల ప్రాంత రైతు

మహదేవపూర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : వాణిజ్య పంటలు సాగు చేసి .. విసిగి వేసారి ఓ రైతు వినూత్న పద్ధతిలో బోడకాకర సాగు చేస్తూ అధిక ఆదాయన్ని పొందుతున్నాడు. మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామానికి ఎదునూరి బానేష్ అనే రైతు బోడ కాకర సాగుచేస్తూ అధిక దిగుబడి సాధిస్తూ అందరినీ ఆశ్చర్య పరుస్తున్నాడు. తనకున్న 40 గుంటల భూమిలో గత మూడేళ్ల నుంచి కూరగాయల పంటలు సాగు చేస్తున్నాడు. వాణిజ్య పంటల కంటే కూరగాయలు మేలు అని రైతు తెలుపుతున్నాడు.

వారానికి మూడు నుంచి నాలుగు క్వింటాళ్లు..

తనకున్న భూమిలో పందిళ్లు వేసి బోడకాకరతో పాటు బీరకాయ, కాకరకాయ సాగు చేయడంతో అధిక దిగుబడి సాగిస్తున్నాడు. రోజువారీగా 70 కిలోల బోడకా కరకాయ దిగుబడి రావడంతో భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, కరీంనగర్ ప్రాంతాలకు తరలిస్తున్నానని తెలిపాడు. వారానికి రూ. 50వేలకు పైగా ఆదాయం వస్తున్నట్టు రైతు ఎదునూరి బానేష్ తెలిపారు. కేవలం వర్షాకాలంలో అడవి ప్రాంతాల్లో సాగయ్యే బోడకాకరకాయ ఏడాదిలో నాలుగు నెలల పాటు ఈ సాగు పనికి వస్తుందని రైతు బానేష్ తెలిపాడు.



బోడకాకర కాయ పందిరి వద్ద రైతు ఎదునూరి బానేష్

పల్లెల్లో మొదలైన జీపీ ఎన్నికల సందడి

- రొటేషన్ పద్ధతితో మారనున్న గత రిజర్వేషన్లు
- 50 శాతం రిజర్వేషన్లకే పరిమితం కావడంతో మండలంలో సగం జనరల్ స్థానాలే..

కాటారం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ శరవేగంగా ముందుకు సాగుతోంది. గ్రామపంచాయతీల ఎన్నికలకు ఇటు ప్రభుత్వం అటు ఎన్నికల సంఘం సుముఖత చూపడంతో పల్లెల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఎవరినీ చూసినా ఆయా జీపీల్లో సర్పంచ్ స్థానం రిజర్వేషన్, ఆశావహులెవరోననే చర్చ జోరుగా సాగిస్తున్నారు. పని స్థలాల్లోనూ కూలీలు, కార్మికులు ఎన్నికల గురించి ముచ్చటించడం, ఎవరు పోటీ చేస్తే వ్యక్తిగతంతా, ఊరికి ప్రయోజనంగా ఉంటుందోనని ఆలోచనలు చేస్తుండటం గమనార్హం. మండలంలో 24 గ్రామపంచాయతీలు, 11ఎంపీటీసీ సభ్యుల స్థానాలు, 210 వార్డు సభ్యుల స్థానాలు ఉండగా ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారయంత్రాంగం జీపీలకు రిజర్వేషన్లను రూపొందించారు. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రత్యేక జీవో తేగా దానిని కోర్టు కొట్టేయడంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమీషన్ సూచనలు, కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో 50శాతం రిజర్వేషన్లు మించకుండా పార్టీపరంగా 42శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వడానికి నిర్ణయించింది.

దీంతో మరోసారి అధికారులు ఈ మేరకు ఎస్సీ ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్లను రూపొందిస్తున్నారు. మండలంలో 24 సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఇలా ఉండనున్నాయి. 12జనరల్ స్థానాలు, 2ఎస్టీ, 6ఎస్సీ, 4బీసీ స్థానాలు ఉండే అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు 2011జనాభా లెక్కలననుసరించి చేయనుండగా బీసీ రిజర్వేషన్లు 2024లో చేసిన ఎస్‌ఈఈఈపీసీ సర్వే ప్రకారం చేయడం జరుగుతోంది. దీంతో రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు మారనుండగా మొదట ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జీపీలు, ఆ తర్వాత ఎస్సీ జనాభా, బీసీ జనాభా అధికంగా ఉన్న జీపీలను తీసుకుని రిజర్వేషన్ల ను ఎంపిక చేస్తున్నారు. దీంతో గత సెప్టెంబరు నెలలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం వచ్చిన రిజర్వేషన్లు చాలా వరకు మారనున్నాయి. ముఖ్యంగా ఎక్కువగా బీసీ, జనరల్ స్థానాల్లో, కొన్ని ఎస్సీ స్థానాల్లోనూ మార్పులుండవచ్చని తెలుస్తోంది.



రేగులగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం

జాతీయ స్థాయి టెన్నీకాయిట్‌కు ఎంపిక

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. హన్మకొండలో టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. సీహెచ్ పవన్ ఇంటర్ ప్రథమ ఎంపీసీ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం, ఆర్. ప్రణయ్ టెన్త్ విద్యార్థి 4వ స్థానం దక్కించుకున్నారని ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రవీందర్, పీడీ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 26 నుంచి 30 వరకు జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నారని పేర్కొన్నారు.

ఎంపికైన విద్యార్థులను శనివారం అభినందించారు. వీరు జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయేందర్, చారి, సైదాబాబు, ఉమ్మడి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ బాధ్యులు రాజ్‌కుమార్, శ్యామ్, జోహర్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ గురుకుల విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తేనెటీగల పెంపకం ప్రయోజనకరం

స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్‌రెడ్డి

కాటారం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగానికి అనుబంధంగా శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం ప్రయోజనకరంగా ఉంటుందని స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్‌రెడ్డి అన్నారు. కాటారం ఏఎంసీ కార్యాలయంలో ఎన్‌బీబీ (నేషనల్ బీ బోర్డ్)సహకారంతో ఎన్ఐపీహెచ్ఎం ఆధ్వర్యంలో తేనె టీగల పెంపకంపై జరుగుతున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లోనూ రాణించి ఆదాయం పెంపొందించుకోవాలని సూచించారు. తేనెటీగల పెంపకం, తేనెసేకరణ, విక్రయాలతో ప్రజలకు ఉపాధి లభిస్తుందన్నారు. తేనెటీగల పెంపకంపై నిర్వాహకురాలు సంజన పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎన్ఐపీహెచ్ఎం ఏడీ జ్యోతి, కాంగ్రెస్ నేతలు, రైతులు కుంభం రమేష్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఖలీల్‌పాషా, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



తేనెటీగల పెంపకాన్ని పరిశీలిస్తున్న ప్రకాష్‌రెడ్డి

విద్యుత్ సమస్యల పరిష్కారానికే పొలం బాట

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రైతులకున్న విద్యుత్ సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికే పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఎన్పీడీసీఎల్ ఏఈ పగిడిముంతల శంకర్ తెలిపారు. శనివారం మండలంలోని తాటికొండ గ్రామంలో సిబ్బంది రైతులకు ఉన్న విద్యుత్ సమస్యలను తెలుసుకొని పరిష్కరించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వ హించి, లూజ్ లైన్లు ఉన్న చోట అదనంగా విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేసినట్లు ఏఈ తెలిపారు. లైన్మెన్ దేవి సురేందర్ రెడ్డి, రాజేందర్, రైతులు నర్రెంగుల చేరాలు, నాగరాజు, సాంబరాజు, పుట్ట ఉప్పలయ్య, ఉబ్బని జన్నయ్య, అశోక్, నర్సయ్య పాల్గొన్నారు.



తాటికొండలో పొలంబాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

మహిళల సాధికారత పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

తాడ్వాయి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల సాధికారత లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ దివాకరతో కలిసి పర్యటించిన మంత్రి సీతక్క 7311మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని 120 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.8 కోట్ల పంపిణి చెక్కులను మహిళలకు అందజేశారు. అంతేకాకుండా మండలానికి చెందిన 11మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు


● వెంకటాపూర్ : మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. అదేవిధంగా 195 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.26కోట్ల50లక్షల రుణాలను చెక్కు రూపంలో పంపిణీ చేశారు. 43మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలు అందజేశారు. అదేవిధంగా 283 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.29కోట్ల86లక్షల50వేల రుణాలను చెక్కు రూపంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



గోవిందరావుపేటలో మహిళలకు చీరలు అందజేస్తున్న మంత్రి సీతక్క

బీసీల ఆశలు గల్లంతు



- 42 శాతం అమలు లేక సగం తగ్గిన సీట్లు
- పాత రిజర్వేషన్ల విధానంతో నిరాశ
- నిరుత్సాహంలో ఆశావహులు

హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 50 శాతం మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గతంలో ప్రకటించినట్లు 42 శాతం రిజర్వేషన్లు అమలైతే అదనంగా లభించే సీట్లను బీసీలు గణనీయంగా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో బీసీ స్థానాల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల్లో తీవ్ర నిరాశ నెలకొన్నది. అక్టోబరులో ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు రిజర్వు అయిన స్థానాల్లో పోటీకి నేతలు అప్పటి నుంచే సిద్ధమయ్యారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకోవడం, మద్దతుదారులను కూడగట్టుకోవడంలో బిజీ అయిపోయారు. కానీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో బీసీల ఆశలు గల్లంతయ్యాయి. గతంలో మాదిరిగానే 50శాతం మించకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు అమలు చేయాల్సి రావడంతో బీసీ ఆశావహులు పోటీ చేయడానికి సిద్ధపడుతున్న స్థానాల రిజర్వేషన్ మారే పరిస్థితి ఏర్పడింది.

ఉదాహరణకు హనుమకొండ జిల్లాలో 205 గ్రామ పంచాయతీల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలైతే 86 స్థానాల్లో వారు పోటీ చేసే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు పాత రిజర్వేషన్ ప్రకారం అయితే 45 నుంచి 47 స్థానాలకు మించి పోటీ అవకాశం లేదు. దీని వల్ల బీసీలు సుమారు 41 సీట్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. డెడికేటెడ్ కమిటీ సర్వే నివేదిక ప్రకారం జిల్లాలో తాజాగా ఎస్సీ జనాభా దామాషా ప్రకారం 50 నుంచి 52 స్థానాల్లో పోటీకి అవకాశం ఉండగా ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం 3 స్థానాలకు మించి దక్కేట్టు లేదు. బీసీల విషయానికి వస్తే జనాభా దామాషా ప్రకారం కాకుండా పాత రిజర్వేషన్ ప్రకారం 45 నుంచి 47 స్థానాల్లో మాత్రమే పోటీకి అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మిగిలిన 105 అన్‌రిజర్వ్‌డ్ స్థానాల్లో 50 శాతం మహిళలకు రిజర్వుకాగా మిగతా 50 శాతం సీట్లలో ఉవరైనా పోటీ చేయవచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 1,708 గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇంతకు ముందు ప్రకటించినట్లు 42 శాతం రిజర్వేషన్ ప్రకారం అయితే బీసీలు 717 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ చేసే అవకాశం ఉండేది. కానీ పాత రిజర్వేషన్ ప్రకారం ప్రస్తుతం సుమారుగా 393 స్థానాల్లో పోటీకి అవకాశం ఉంది. అంటే 324 స్థానాల్లో పోటీ చేసే అవకాశం జారీ పోయినట్టు భావించాల్సి వస్తోంది. పార్టీ గుర్తులు లేకుండా జరిగే పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ మద్దతుతో బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో పోటీ చేయగలిగితే వారి సంఖ్య పెరగవచ్చు.

నేతల్లో ఉత్కంఠ

తమ ఊరి సర్పంచ్ రిజర్వేషన్ దేనికి ఖరారవుతుం దనే ఉత్కంఠ గ్రామాల్లో నెలకొన్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పుల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో పాత రిజర్వేషన్ల విధానానికి జిల్లా యంత్రాంగాలు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో రిజర్వేషన్ల ప్రకటనపై నేతలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ నెలాఖరులోపు షెడ్యూల్ వెలువడుంతుందనే ప్రచారం జోరందుకున్న తరుణంలో అధికారు లు కూడా 2019 పంచాయతీ ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్ల ప్రకారమే 50 శాతాన్ని మించకుండా ప్రక్రియను కొనసాగిస్తున్న నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయడానికి సన్నద్ధమవు తున్న ఆశావహుల్లో ఆందోళన నెలకొన్నది. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్ల ఖరారు చేయాలని చెప్పడంతో ఈసారి ఆరు జిల్లాల్లో మార్పులు చేర్పులు ఉండవచ్చునని భావిస్తున్నారు. పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులంతా అధికారిక ప్రకటన కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత నెలలో ప్రకటించిన రిజర్వేషన్లలో బీసీ స్థానాల్లో చాలా వరకు అన్ రిజర్వుడ్ కానున్నాయి.

శిలాఫలకాల ధ్వంసం

- అర్ధరాత్రి కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు
- ఇది బీఆర్‌ఎస్ పనేనని కాంగ్రెస్ ఆరోపణ
- తాము కాదంటున్న బీఆర్‌ఎస్ నాయకులు
- కొడకండ్లలో రెండు చెక్‌డ్యామ్‌ల శిలా ఫలకాల ధ్వంసంపై రచ్చ


కూల్చివేసిన శిలా ఫలకాన్ని చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

కొడకండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కొడకండ్ల మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శంకుస్థాపన చేసిన రెండు చెక్‌డ్యామ్‌ల శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి ధ్వంసం చేయడం స్థానికంగా రాజకీయ వేడిని రాజేసింది. ఇది బీఆర్‌ఎస్ పనేనని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తుండగా, నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఒకరిపైఒకరు ఆరోపణ, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఈ ఘటనపై మండలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై స్పందించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, శిలాఫలకాలను బీఆర్‌ఎస్ నాయకులే కూల్చారని నేరుగా ఆరోపించారు. సురేష్ నాయక్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము స్పందించారు. శిలాఫలకం ఎవరు కూల్చారో తెలుసుకోకుండా బీఆర్‌ఎస్‌పై బురదజల్లడం సరి కాదన్నారు. కూల్చేంత కర్మ బీఆర్‌ఎస్‌కు లేదన్నారు. కాంగ్రెస్‌లోనే రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకుంటున్న వాళ్లే కూల్చేసి ఉంటారని పేర్కొన్నారు. సురేష్ నాయక్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు అని ఎద్దేవా చేశారు.

● పాలకుర్తి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చెక్‌డ్యాంల నిర్మాణానికి మంజూరైన నిధులను తాము మంజూరి చేసినట్లు కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని ఆ పార్టీ మండల కమిటీ విమర్శించింది. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషితో వల్మిడి, ముత్తారం గ్రామాల్లో చెక్‌డ్యాంల నిర్మాణానికి 2023లోనే నిధులు మంజూరు చేశారన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వమే మంజూరి చేసిందని కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి గతంలో మంజూరైన ప్రొసీడింగ్‌ను మార్చి ఈ ప్రభుత్వంలోనే మంజూరైనట్లు కొత్త ప్రొసీడింగ్ ద్వారా నిధులు మంజూరి చేయించినట్లు శంకుస్థాపన చేశారని అన్నారు. సమావేశంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి, పుస్కూరి కళింగరావు, వీరమనేని సోమేశ్వర్‌రావు, గూడ దామోదర్, మహేందర్ నాయక్, గణేష్, కత్తి సైదులు, సోమయ్య, పంగ సైదులు, కర్ణాకర్‌రెడ్డి, పాము శ్రీనివాస్, కొంరెల్లి ఉన్నారు.


పాలకుర్తిలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


కేసముద్రం రైల్వేస్టేషన్ వద్ద వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన అయ్యప్ప మాలధారులు

ప్రత్యేక రైళ్లు ఏవి 'స్వామి'?!

- శబరిమలకు వెళ్లేందుకు అందుబాటులో లేని స్పెషల్ ట్రైన్లు
- ఉమ్మడి జిల్లా నుంచి ఒకే ఒక్కరైలు
- మాలధారుల ఎదురుచూపులు

కేసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పమాల ధరించిన ప్రతిఒక్కరూ శబరిమలలోని స్వామివారిని దర్శించుకోవడం ప్రధానమైన అంశంగా భావిస్తారు. ఈ ప్రాంతం నుంచి శబరిమలకు వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు అందుబాటులో లేకపోవడంతో వేలాది మంది అయ్యప్ప మాలధారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కాలం (41 రోజులు) అయ్యప్ప దీక్షాపరులు శబరిమలకు వెళ్లి స్వామి దర్శనం చేసుకోవడమే దీక్షకు ముగింపని మాలధారుల నమ్మకం. శబరిమల యాత్రలో భక్తులకు సహనం, నియమాలు, కష్టపడడం, భక్తి, ఇతరుల పట్ల వినయం ఏర్పడి అధ్యాత్మిక అనుభవం వస్తుంది.

'స్వామియే శరణం అయ్యప్పా' అంటూ లక్షలాది మంది భక్తుల సమూహం వెళ్లడం కూడా ప్రత్యేక శక్తిని ఇస్తుందని భక్తులు నమ్ముతుంటారు. ఈ నేపథ్యంలో ప్రతీ ఏటా మాలధారణ చేసిన వారు నవంబర్ 16 నుంచి డిసెంబర్ 27 వరకు నిర్వహించే మండల పూజా మహోత్సవం, డిసెంబర్ 30 నుంచి జనవరి 20 వరకు మకరవిళక్కు ఉత్సవం సందర్భంగా ఈ దర్శనాలు చేసుకునేందుకు ప్రధానంగా భావిస్తూ దీక్షాపరులు లక్షల మంది పోటెత్తుతారు. అత్యంత పవిత్రంగా భావిస్తూ ప్రత్యేకంగా మకర సంక్రాంతిన మకర జ్యోతి దర్శనం కోసం అయ్యప్పస్వాములతో శబరిమల కిక్కిరిసిపోతుంది.

ఈ ప్రాంతం నుంచి ఒకేఒక ప్రత్యేక రైలు

మహబూబాబాద్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది అయ్యప్ప మాలధారులు శబరిమలకు వెళ్లేందుకు ఈ ప్రాంతం మీదుగా రైల్వేశాఖ ఒకే ఒక్క రైలును నడుపుతోంది. చెర్లపల్లి నుంచి వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తిరుపతి మీదుగా కేరళకు సోమ, శుక్రవారాల్లో నడిచే చెర్లపల్లి-కొట్టాయం (07115/07116) ప్రత్యేక రైలు ఒక్కటే ఈ ప్రాంత భక్తులకు అందుబాటులో ఉంది. మిగతా రైళ్లన్నీ చెర్లపల్లి నుంచి నడికుడి జంక్షన్, గుంటూరు, తిరుపతి మీదుగా కేరళ వెళ్తున్నాయి.

వరంగల్, మహబూబాబాద్ నుంచి శబరిమలకు వెళ్లేందుకు కేరళలోని కొట్టాయం, చెంగనూరు రైల్వేస్టేషన్లకు భక్తులు చేరుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ అవుతుండగా ప్రత్యేక రైళ్లలో 15 నుంచి నెల రోజుల ముందు నుంచే రిజర్వేషన్ చేసుకునే అవకాశాన్ని ఇస్తున్నారు. ఈ నెల 16 నుంచి మండల పూజా మహోత్సవాలు ప్రారంభం కావడంతో భక్తులు శబరిమలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక రైళ్లు అందుబాటులో లేకపోవడంతో అయ్యప్ప మాలధారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖ మహబూబాబాద్ ప్రాంతం నుంచి ప్రత్యేక రైళ్లను నడపాలని అయ్యప్ప దీక్షాపరులు కోరుతున్నారు.

వరంగల్ నగరాభివృద్ధికి కృషి

- ఎంపీ కడియం కావ్య
- ఉనికిచర్లలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం :
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


ఉనికిచర్ల నగర పంచాయతీలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి తదితరులు

ధర్మసాగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధి కోసం అందరి సహకారంతో కృషి చేస్తున్నట్లు ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల నగర పంచాయతీలో కుడా యూనిసిటీ వెంచర్ అభివృద్ధి, రూ.10 కోట్లతో చేపడుతున్న డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ ఇప్పటికే నగరానికి ఎయిర్‌పోర్టు, కోచ్ ఫ్యాక్టరీ, టెక్స్‌టైల్ పార్కు, స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు నగర ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అండర్ డ్రెయినేజీ నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.4 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ వెంచర్ వరకు నిర్మించే నాలుగు లైన్ల బీటీ రోడ్డును ఉనికిచర్ల గ్రామం వరకు పొడిగించాలని కోరారు. ఇదే గ్రామంలో ఇంటర్ నేషనల్ క్రికెట్ స్టేడియం రాబోతుందన్నారు. భవిష్యత్‌లో ఈ రహదారిని ఉనికిచర్ల నుంచి రాపాకపల్లి, దేవునూర్ గుట్టల వరకు నిర్మించనున్నట్లు తెలిపారు. దేవునూర్ గుట్టలను ఎకో టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రాంత ప్రజలు హాలీడేస్‌లలో సేద తీరేందుకు ఆక్సీజన్ పార్కు, ట్రెక్కింగ్, రాత్రి బస చేసేందుకు రిసార్ట్ వంటి సదుపాయాలను కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, ప్రదీప్ కుమార్, రఘు, రాజు, మండల ఉపాధ్యక్షులు వక్కల రవీందర్, కందుకూరి సుధాకర్ పాల్గొన్నారు.

స్పీకర్ నిర్ణయాకి కట్టుబడి ఉంటా..

రాజీనామా విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని బట్టి తన నిర్ణయం ఉంటుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నవంబరు 23 లోపు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చారన్నారు. దానిపై మరింత సమయం కావాలని స్పీకర్‌ను కలిసి కోరడం జరిగిందన్నారు. దీనిపై స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తున్నట్టు వెల్లడించారు. ఉపఎన్నిక వస్తే పోటీ చేసేది కడియం శ్రీహరే.. ప్రజలు గెలిపించేది కూడా శ్రీహరినే.. అని ధీమా వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

హసన్‌పర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన మానవ జీవితమే శ్రేష్ఠమైనదని, ప్రతీ విద్యార్థికి విలువలతో కూడిన విద్య అందించాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వివి.నిర్మలాగీతాంబ అన్నారు. భీమారం ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఆవరణలో 'విద్యార్థులకు చట్టాలపై అవగాహన - యువతపై ప్రభావం' అనే అంశంపై నార్కోటిక్స్, పీవోసీఎస్‌వో, యాంటీ ర్యాగింగ్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వివి.నిర్మలాగీతాంబ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా మంచి భవిష్యత్తును పునర్నిర్మించుకోవాలని సూచించారు. ర్యాగింగ్ చట్ట వ్యతిరేకమని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినమైన శిక్షలు ఉన్నందున ర్యాగింగ్‌కు పాల్పడి తమ ఉజ్వలమైన భవిష్యత్తును కోల్పోవద్దన్నారు. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, హనుమకొండ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.ఉషాక్రాంతి, హనుమకొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పులి సత్యనారాయణ, ఎస్‌వీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ అజేంద్రకుమార్ రాథోడ్, కౌన్సిలర్ నీరజ, హెల్పింగ్ హ్యాండ్ ఎన్‌జీవో డి అడిక్షన్ కౌన్సిలర్ కె.రజిత మాట్లాడుతూ మానవుడు మనిషిలాగా జీవించగలిగితే ఈ సమాజంలో పోలీసు స్టేషన్లు, కోర్టులు, రాజకీయ నాయకుల అవసరం ఉండదన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి కె.పూజిత మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎటువంటి న్యాయ సలహా లకైనా, సమస్యలున్నవారు 15100 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు, వైస్ చైర్మన్ డాక్టర్ ఇ.సువర్ణ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



శుభకార్యాలకు విరామం

- 3 నెలల పాటు ముహూర్తాలు నిల్
- ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యం
- 83 రోజుల తర్వాతే ఫంక్షన్లు

వెంకటాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి.. ఖర్మ కాలాలు లేదా మౌఢ్య సమయాలు లాంటివి జ్యోతిష్య శాస్త్రం ద్వారా వినిపించే మాటలు.. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభముహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల మార్గశిర శుద్ధ సప్తమి 28న ప్రారంభం కానున్న శుక్ర మౌఢ్యమి (మూఢం) మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభకార్యాలకు సెలవు ప్రకటించాల్సిందే.

పవిత్ర తిథులు..

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ సారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు మాత్రమే ఉండగా, పుష్య మాసం శూన్యమాసం అవుతుంది. ఇక మాఘ మాసంలోనూ ఒక్క ముహూర్తం లేకపోవడం గమనార్హం. గృహప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘీగా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులు ఈ సారి మూఢంలోనే కలిసిపోతున్నాయి.



ఒక్క ముహూర్తం లేదు..

ఎం. రఘునాథచార్యులు, పురోహితుడు



ఈ నెల 28 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలల పాటు శుభకార్యాలకు మంచి రోజులు లేవు. శుక్ర మౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తం ఉండదు. వివాహాలతో పాటు గృహప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు, అఖరికి వరపూజల వంటి కార్యాలు కూడా చేసుకోకూడదు. వైదిక పురోహితులకు ఈ మూడు నెలలు గడ్డుకాలమే.

వ్యాపారాలపై ప్రభావం

శుభకార్యాలు లేకుంటే వివాహ మండపాలు, ఫంక్షన్‌హాళ్లు, వస్త్రదుకాణాలు, నగల షాపుల యజమానులు, స్వర్ణకారులు, క్యాటరింగ్, డెకరేషన్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజే, అద్దె కార్లు, బస్సులు వంటి సంబంధిత రంగాల వ్యాపారులు నెలల కొద్దీ నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

మూఢం అంటే..

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాల్లో కనుమరుగై పోవడాన్ని మూఢం అంటారు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో, శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. శుక్రుడు బలహీనమైతే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వం వంటి విషయాల్లో ప్రతికూలతలు ఏర్పడుతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభ సూచికం కాదని సూచిస్తున్నారు.

ప్రపంచంలో ప్రతి విద్యార్థి అద్భుతమైన శక్తే

- నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి
- వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హసన్‌పర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ప్రతి విద్యార్థి ఒక అద్భుతమైన శక్తేనని, తనలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకోగలిగితే గొప్ప వ్యక్తిగా రాణించగలడని వరంగల్ నిట్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. మండలంలోని ఎర్రగట్టు గుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్లే ఫీల్డ్‌లో ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన కిట్స్ 8వ అటానమస్ 2021-25 బ్యాచ్ 42వ యాన్యువల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా వరంగల్ నిట్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి అగస్టు, గౌరవ అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, కిట్స్ గవర్నింగ్ బాడీ చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, కిట్స్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే వి.సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.అశోకొరెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా అకాడమిక్ అండ్ కో కరికులర్ ఆక్టివిటీలలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన 16 మంది విద్యార్థులకు బంగారు పతకాలను, 15 అకాడమిక్ మెరిట్ అవార్డులు, డిగ్రీలు, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ గ్రాండ్ ఆంట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ రిజిస్ట్రార్ ఎం.కోమల్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ వి.రాజగోపాల్, అకాడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కె.వేణుమాధవ్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.కిరణ్‌కుమార్, డాక్టర్ ఎస్.ఉమామహేశ్వర్, డాక్టర్ డి.రాజయ్య, యూజీ కోర్సు ల ఇన్‌చార్జి ఫ్యాకల్టీ డాక్టర్ పి.ప్రభాకర్‌రావు, పీజీ కోర్సుల ఇన్ చార్జి ఫ్యాకల్టీ డాక్టర్ ఆర్.శ్రీకాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ డి.ప్రభాకరచారి, వి.కిషన్‌రావు, వెంకట్రాంరెడ్డి, దేవీప్రసాద్, ఎ.సత్యనారాయణరాజు, డాక్టర్ వి.పవన్, కె.ప్రతాప్‌రెడ్డి, ఎ.హరీష్, వి.శ్రీరాంరావు, వివిధ విభాగాధిపతులు, డీన్స్ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంచాయతీ రిజర్వేషన్లపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

ఎంపీడీవోలు మిగిలిన రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి ఆయా ప్రతులను సంతకాలు చేసి డీపీవోకు అందజేస్తారు. వీటిని కలెక్టర్ పునఃపరిశీలించి ఎన్నికల షెడ్యూల్‌ను బట్టి గెజిట్‌లో అధికారికంగా ప్రకటిస్తారు.


గిరిజన గ్రామాల్లో..

మహబూబాబాద్, ములుగు జిల్లాలో గిరిజన గ్రామాలే ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి గిరిజన గ్రామాలు ఎక్కువ ఉన్న జిల్లాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను ఎస్టీలకు రిజర్వు చేస్తారు. మిగిలిన పంచాయతీలను ఎస్టీ ఎస్సీ బీసీ, జనరల్‌కు రిజర్వు చేయాల్సి ఉంటుంది. వీటిల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించినవి పోను మిగిలిన వాటిని డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా ఖరారు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

ఒక పక్క రిజర్వేషన్ల ఖారారుకు కసరత్తు జరుగుతుండగా మరో పక్క ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు జోరందుకున్నాయి. ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడే అవకాశాలు ఉండడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. తప్పులు సరవరించిన పల్లె ఓటర్ల తుది జాబితాను ఈ నెల 23వ తేదీన విడుదల చేయనున్నారు. ఇప్పటికే అవసరమైన బ్యాలెట్ పెట్టెలను అందుబాటులోకి తెచ్చారు. ముద్రణ సామగ్రిని గతంలోనే సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించారు. అవసరమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణ దాదాపు పూర్తి కావచ్చింది. తాజాగా కలెక్టర్లు నోడల్ అధికారులను కూడా నియమించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
ఆదివారం 23 నవంబరు 2025
8



ఉపాధి కల్పించాలని కూలీల ఆందోళన

మహదేవపూర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కన్నెపల్లిలో శనివారం ఇసుకల లారీలను అడ్డుకుని కూలీలు నిరసన తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం బీరసాగర్, కన్నెపల్లి గ్రామాల మధ్యన ఇసుక క్వారీ ఏర్పడడంతో బీరసాగర్ గ్రామానికి చెందిన కూలీలు క్వారీలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కన్నెపల్లికి చెందిన కూలీలు సైతం తమకు పని కల్పించాలని లారీలను ఆపి ఆందోళనకు దిగారు. ఈ క్వారీ తమ గ్రామానికి పరిధిలో ఉందని తమకు కూడా ఉపాధి కల్పించాలని తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో వందేమాతరం ఉత్సవం

- భారీ ర్యాలీ తీసిన నాయకులు

ములుగు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం ఉత్సవం కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా కన్వీనర్ జాడి వెంకట్ ఆధ్వర్యంలో నాయకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు బంకించంద్ర ఛటర్జీ రచించిన జాతీయగీతం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొంబ బలరాం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వందేమాతరం ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తుందని అన్నారు. వందేమాతరం గేయం స్ఫూర్తితో బ్రిటిష్ వలసవాదులను తరిమికొట్టడానికి యావత్ భారతదేశ ప్రజల చైతన్యానికి ఇదొక మంత్రంలా పనిచేసిందని అన్నారు. వందేమాతరం అంటే ఒక ప్రార్థనగా భావిస్తామని, భారత దేశాన్ని మేలుకొల్పిన తొలిమంత్రం వందేమాతరం గేయమైందని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలను ఐక్యం చేసిన ఘనత వందేమాతరం సొంతమని పేర్కొన్నారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, అజ్మీరా కృష్ణవేణినాయక్, భూక్య జవహర్‌లాల్, నాయకులు నగరపు రమేష్, బైకని మహేందర్, అల్లె శోభన్, గుగులోత్ స్వరూప, జినుకల కృష్ణాకర్‌రావు, చందా జ్యోతి, మండల లవన్, రాయంచు నాగరాజు, సూర్యదేవర విశ్వనాథ్, కొత్త సుధాకర్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ములుగులో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పట్టాలిచ్చారు.. స్థలమివ్వాలి

కృష్ణకాలనీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన 37 మంది జర్నలిస్టులు శనివారం రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో గల కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లే దారిలో టెంటు వేసుకొని దీక్షకు పూనుకున్నారు. గతంలో 37 మంది జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు జారీ చేశారని, నేటి వరకు కూడా స్థలాలు చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే వెంటనే చొరవ చూపి గతంలో ఇచ్చిన వారందరికి స్థలాలు చూపించాలని వారు డిమాండ్ చేశారు. కాగా, వీరి రిలే నిరాహార దీక్షకు వివిధ జర్నలిస్టు సంఘాల నేతలు, వివిధ పార్టీల నేతలు సంఘీభావం తెలియజేశారు. పట్టాలు పొందిన 37 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఈ నెల 24న అందెశ్రీ సంస్మరణ సభ


మాట్లాడుతున్న గోల్కొండ బుచ్చయ్య

ములుగు టౌన్, నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వెనుక మునిసిపల్ కమ్యూనిటీ హాలులో రాష్ట్ర గీత రచయిత డాక్టర్ అందెశ్రీ సంస్మరణ సభ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు గోల్కొండ బుచ్చయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం కళాకారుల సమావేశం నిర్వహించడం జరిగింది. అందెశ్రీ ఆశయాలు కొనసాగింపుగా తన జ్ఞాపకాలను స్మరించుకోవడం కొరకు సంస్మరణ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాగుల శంకర్, ఎండీ రహీమొద్దీన్, రేలా విజయ్, అమ్మపాట తిరుపతి, గోల్కొండ నరేష్, మోతె రమేష్ పాల్గొన్నారు.

‘ పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ’

ఏటూరునాగారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ముఖ్యంగా పేదలకు చేయూత అందించేలా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన జనగాం బుచ్చయ్య ఇటీవల మృతి చెందడంతో, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ నాయకులతో కలిసి రఘు దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. మృతుడి చిత్రపటానికి మాల వేసి నివాళులర్పించిన అనంతరం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున 50 కే జీల బియ్యాన్ని ఆ కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, టౌన్ అధ్యక్షుడు ఎమ్డీ. సులేమాన్, మండల నాయకులు ఉమ్మనేని రమేష్, గంపల శివ కుమార్, టౌన్ ఉపాధ్యక్షులు రాంబాబు, రతన్ పాల్గొన్నారు.

ఇంటిపన్ను వసూళ్ల

అవకతవకలపై విచారణ చేయాలి


ఫిర్యాదు చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, శేఖర్

కాటారం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగారం జీపీ పరిధిలో 2017-2021 వరకు చేసిన ఇంటి పన్ను వసూళ్లలో భారీగా అవతవకలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని బీఆర్ఎస్ నేత చల్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీపీవో శ్రీలతకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వారు శనివారం తెలిపారు. ఎక్కడ లేని విధంగా సాధారణ ఇంటికి సైతం వేలాది రూపాయల హౌస్ ట్యాక్స్ వసూలు చేసి ఖజానాలో జమ చేయకుండా చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపించారు. ఇటీవల పత్రికల్లో కథనాలు రాగా మండలస్థాయి అధికారులు తూతూమంత్రంగా విచారణ చేశారని, రికార్డులు, ఇంటిపన్ను రసీదుల ఆధారంగా అవకతవకలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.

‘ హలో మాల- చలో ఢిల్లీ ’ సభను జయప్రదం చేయాలి

ఏటూరునాగారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దళితుల రాజ్యాంగ హక్కుల సాధన లక్ష్యంగా, మాల మహానాడు ఆధ్వర్యంలో ఈనెల 26న ఢిల్లీలో నిర్వహించనున్న హలో మాల - చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ములుగు జిల్లా నాయకులు, మాల మహానాడు జాతీయ కమిటీ సభ్యులు కాళ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. మాలలపై జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ, 12 అంశాలతో కూడిన డిమాండ్ల సాధన కోసం ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న జీవో 99 రోస్టర్ విధానాన్ని తిరిగి పునఃసమీక్షించాలని, ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు 12 అంశాల డిమాండ్లను సాధించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాలలంతా అధిక సంఖ్యలో ఢిల్లీకి తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు చిట్టిమల్ల సమ్మయ్య, మాదరి రామయ్య, మాదరి చంద్రమౌళి, మాదరి రాంబాబు, పెంచికల లక్ష్మీనారాయణ, మాదరి రాజు, గోస్కుల రాంబాబు, ఎమ్డీ. ఖజా పాషా, శ్రీనివాసరెడ్డి, దేవేందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చలో ఢిల్లీ సభ కరపత్రాన్ని విడుదల చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు

మహిళా సంఘాల సభ్యులకు

మంత్రి చీరల పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలు అందజేశారు. అదేవిధంగా 370 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.46 కోట్ల 50లక్షల రుణాలను చెక్కు రూపంలో పంపిణీ చేశారు. మండలంలోని 38మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కలెక్టర్ టీఎస్. దివాకర, అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస రావు, పీఏసీఎస్ చైర్మన్లు సత్తిరెడ్డి, రాములు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థినులను సన్మానిస్తున్న నూనెటి శ్యాం తదితరులు

ములుగు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనెటి శ్యామ్ యాదవ్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ 17 బాలబాలికల రెజ్లింగ్ పోటీల్లో మండలంలోని జగ్గన్నపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు 46 కేజీల విభాగంలో ఐశ్వర్య గోల్డ్ మెడల్, సంజన సిల్వర్ మెడల్, 43 కేజీల విభాగంలో అక్షయ సిల్వర్ మెడల్, 40 కేజీల విభాగంలో శాలిని సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా శనివారం జగ్గన్నపేట ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఆయన వారిని శాలువాతో సన్మానించారు. గోల్డ్ మెడల్ సాధించిన ఐశ్వర్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమని అన్నారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ క్రీడారులకు డంబెల్ కిట్ అందించి పౌష్టికాహారాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా రెజ్లింగ్ జాయింట్ సెక్రటరీ నాగభూషణ్, రెజ్లింగ్ కోచ్ సతీష్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ భరత్, పంచాయతీ సెక్రటరీ స్వాతి, కారోబార్ అరెందుల సాంబయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సారయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహేందర్

వెంకటాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్‌లు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరగగా వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు పోక్సో విద్యాహక్కు, ర్యాగింగ్, బాల్య వివాహ నిరోధకం, మోటార్ వెహికల్ చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయానికి టోల్‌ఫ్రీ నంబర్ 15100కు కాల్ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చందర్, అధ్యాపకులు బి.చరణ్, గోవర్ధన్, కిరణ్‌కుమార్, సుస్మిత, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

ఏటూరునాగారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్‌గా కూనూరు అశోక్ గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ అశోక్ మాట్లాడుతూ.. మండలంలోని రైతుల సమస్యల పరిష్కారానికి, వారి సర్వతోముఖాభివృద్ధికి తన వంతుగా శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు మెరుగైన సేవలు అందించడానికి పీఏసీఎస్ యంత్రాంగం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది, పలువురు రైతులు హాజరై నూతన చైర్మన్ అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

దివ్యాంగ ఉద్యోగులపై చిన్నచూపు

మంగపేట నవంబరు22 (ఆంధ్రజ్యోతి) డిడబ్ల్యూడి, డిఈఓ, ఎంఈఓ కార్యాలయాల్లోని ఉన్నతాధికారులు దివ్యాంగ ఉపాధ్యాయులను ఉద్యోగులను చిన్న చూపు చూస్తున్నారని డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో దివ్యాంగ ఉద్యోగుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా హాజరైన గడ్డం శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులకు అనేక సదుపాయాలను కల్పిస్తున్నా వాటిని అందించడంలో ములుగు జిల్లా కేంద్రంలోని డీడబ్ల్యూడి, డీఈవో, కార్యాలయాలతో పాటు ఎంఈవో కార్యాలయాలలోని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిసున్నారని అన్నారు. కలెక్టర్ స్పందించి దివ్యాంగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వడంతో పాటు ఉన్నతాధికారులు దివ్యాంగులను కనీసం మనుషులుగా గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు. దివ్యాంగ ఉద్యోగ సంఘం నాయకులు రజిత, వెంకటేశ్వర్లు, రఘు, నరేందర్ రెడ్డి, వెంకట నరేష్, పటాన్ ఆస్మా బేగం, శశిధర్ రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

మల్హర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : రైతులను రాజుగా చూడాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి శనివారం అన్నారు. మండలంలోని కొయ్యూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ఇప్ప మొండయ్యతో కలిసి ప్రారంభించారు. ఏవో శ్రీజ, పార్టీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సవేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచయ్య, జంగిడి శ్రీనివాస్, పీఏసీఎస్ కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్, నారాయణ, కొండ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి : మండలంలోని పర్లపల్లి గ్రామంలో జీవనజ్యోతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి తహసీల్దార్ సునీతతో కలిసి ప్రారంభించారు. పలు అంశాలపై చర్చించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహమ్మద్ రఫీ, ఎంపీడీవో సురేందర్, ఏపీఎం రమాదేవి, ఏఈవో అభిలాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సతీష్, లింగయ్య, సీసీ శ్రీనివాస్, గ్రామసంఘం అధ్యక్షురాలు సునీత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, జిల్లా నాయకులు తక్కళ్లపల్లి రాజు, గాజుల సమ్మయ్య, క్యాతరాజు రమేష్, రైతులు పాల్గొన్నారు.

● కాటారం : మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సంఘం చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ ప్రారంభించారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమలతో కలిసి పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్ పీపీసీని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. కాంటాలు సక్రమంగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, డైరెక్టర్లు ఐలి రాజబాపు, జక్కుల అజయ్ కుమార్, ఐత కృష్ణవేణి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఏఎంసీ డైరెక్టర్ పిల్లమారి రమేష్, ఏఈవో ఆస్మా, రైతులు, హమాలీ సంఘం నేతలు, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.


మల్హర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రకాశ్‌రెడ్డి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

నేడు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటన

కాటారం/మహదేపూర్ రూరల్/మహదేవపూర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం భూపాలపల్లి, కాటారం డివిజన్‌లో పర్యటిస్తారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని కుందూరుపల్లి ఏఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 2గంటలకు డివిజన్ ఎస్‌హెచ్‌జీ మహిళలకు, కాటారం బీఎల్ఎం గార్డెన్స్‌లో మధ్యాహ్నం 3గంటలకు కాటారం, మహాముత్తారం, మల్హర్‌రావు, మహదేవపూర్, పలిమెల మండలాలకు సంబంధించిన స్వయంసహాయక సంఘాల మహిళలకు ఇందిర మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తారు. కాటారం డివిజన్ నాలుగు మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారు. అనంతరం సాయంత్రం పలిమెల మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు , మంత్రి సిబ్బంది తెలిపారు.

‘ అక్రమ ఇళ్ల నిర్మాణాలు నిలిపివేయాలి ’

తాడ్వాయి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణాలను అధికారులు నిలిపివేయాలని ఆదివాసి సంఘం తుడుందెబ్బ మేడారం గ్రామ కమిటీ అధ్యక్షుడు గడిగ సునీల్ అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన లంబాడీలు, గిరిజనేతరులు అక్రమంలో భారీ భవన సముదాయాలను నిర్మిస్తున్నారని ఆరోపణలు చేశారు. వెంటనే గ్రామ పంచాయతీలో నమోదు కాని ఇండ్లకు నోటీసులు జారీ చేసి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

వాజేడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, మాజీ జడ్పీటీసీ తల్లడి పుష్పలతలు అందజేశారు. మండలం లోని పేరూరు జీపీలోని రాంపురంకు చెందిన బొల్లె నాగమణి అనారోగ్యంకు గురి కావడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరు కావడంతో ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చొరవతో చెక్కు మంజూరు అయిందన్నారు.

విద్యుత్ లైన్ మార్పునకు సర్వే

వాజేడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగాలలో మంజూరు ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో స్లాబులు వేసేందుకు విద్యుత్ లైన్లు అడ్డుగా ఉండటంతో ఆ లైన్లను మార్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు శనివారం సర్వే నిర్వహించారు. విద్యుత్ ఏఈ అర్షద్‌తో చర్చించి అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్‌లను త్వరితగతిన మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథప్రసాదబాబు రాజు ఉన్నారు.

చెరువు కట్ట పై రోడ్డు నిర్మాణానికి పరిశీలన

మల్హర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలోని కోమటికుంటపై రోడ్డు నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు శనివారం పరిశీలించారు. గత నెల 4న తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్‌కో భూ నిర్వాశిత హక్కుల సాధన కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి గ్రామ రైతుల పక్షాన కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీఎస్ఆర్ నిధులతో కోమటికుంట కట్ట నుంచి ఆర్అండ్ఆర్ ప్లాట్ల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కట్ట పై రోడ్డు నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి ప్రణాళికలు రూపొందించనున్నారు.

పారిశుధ్య కార్మికుడి ఆకస్మిక మృతి

(5వ పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. రాజయ్య గత రెండు రోజులుగా అనారోగ్యంగా ఉన్నాడని, ఆ విషయాన్ని సానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పినా తప్పనిసరిగా విధులకు రావాలని సూచించినట్లు చెప్పుకొచ్చారు. అతడి మూలంగానే రాజయ్య మృతి చెందాడంటూ ఆగ్రహించారు. కాగా, వంద పడకల ఆసుపత్రిలో మృతదేహంతో పాటు ఉన్న సానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్, జవాన్ ప్రశాంత్‌ను బాధిత కుటుంబీకులు చితకబాదారు. దీంతో వారు అక్కడి నుంచి ఠాణాకు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనారోగ్యంతో ఉంటే తాము విధులకే తీసుకోమని, ఉన్నట్టుండి అకస్మాత్తుగా రాజయ్య పడిపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లామని, కానీ, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారని సానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్ వెల్లడించారు.

- కలెక్టరేట్ హాలులో మృతదేహంతో నిరసన..

వంద పడకల ఆస్పత్రికి తీసుకొచ్చిన తరువాత రాజయ్య మృతి చెందాడని వైద్యులు తెలపడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. దీంతో తోటి కార్మికులు, కుటుంబీకులు కలిసి ఆస్పత్రి పక్కన ఉన్న గేటును పగలగొట్టి ఒక్కసారిగా కలెక్టరేట్‌లోకి మృతదేహాన్ని తీసుకెళ్లి కలెక్టరేట్ హాలులో ఉంచి నిరసనకు దిగారు. ఆవేశంలో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలుకి ముందర ఏర్పాటు చేసిన అద్దాలను పగలగొట్టారు. బాధ్యులైన మునిసిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలతో హోరెత్తించారు. కలెక్టరేట్ హాలులో మృతదేహంతో నిరసన తెలుపుతున్నారనే విషయం తెలియగానే జిల్లా అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐలు నరేష్‌కుమార్, కరుణాకర్‌తో పాటు నలుగురు ఎస్సైలు అక్కడకు చేరుకున్నారు. బాధితులను సముదాయించే ప్రయత్నం చేశారు. కలెక్టర్ వచ్చి తమకు న్యాయంపై స్పష్టమైన హామీ ఇస్తేనే మృతదేహాన్ని తీస్తామని నినాదించారు. దీంతో సుమారు అరగంట తరువాత పోలీసులు స్వల్ప లాఠీచార్జీతో నిరసనకారులను చెదరగొట్టారు. మృతదేహంతో పాటు, వారి కుటుంబ సభ్యులను పోలీసు డీసీఎం వాహనంలో ఎక్కించి అక్కడి నుంచి ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ఆ తరువాత పలు పార్టీల నేతలు కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట బైఠాయించి బాధిత కుటుంబీకులకు న్యాయం చేయాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారిని సముదాయించి నిరసన విరమింపజేశారు.